# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 30 జూన్ 2025


## నేడు సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**కడప, జూన్ 29: ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డీఆర్వో కోరారు.

**సభా భవన్‌లో పిజిఆర్ఎస్ నిర్వహణ :** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి ..Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును"ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు...అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం:డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారుప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## అలరించిన నృత్యాలు..

**కడప కార్పొరేషన్ జూన్ 29 ప్రభాతవార్త:**

ఆదివారం కడప శిల్పారామంలో సాంస్కృతి కళావేదిక మీద డ్రీం మీడియా సుజాత వారి సహకారంతో కడప నగరానికి చెందిన కిషోర్ డాన్స్ పల్లె జానపదాలు శాస్త్రీయ నృత్యాలు సినీ నృత్యాలతో ప్రేక్షకులను అలరించాయి. శిల్పరామం పరిపాలన అధికారి యస్. కృష్ణ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షణలో నిర్వహించారు.



### రాష్ట్రంలోనే ఉమ్మడి కడప-చిత్తూరు జిల్లాలలో

# రహదారులకు మహర్దశ

కడప-అన్నమయ్య జిల్లాలలో జాతీయ రహదారులకు మహర్దశ... కడప-చిత్తూరు రహదారికి నాలుగు వరుసల రహదారి యోగం...

ముద్దనూరు-జమ్మలమడుగు రహదారి నాలుగు లైన్లే



920కోట్లతో కొండను తొలచి సొరంగ మార్గం చేస్తారేమో



ఒంపు సొంపుల వయ్యారి రహదారి గువ్వలచెరువు ఘాట్ రోడ్డుకు నాలుగు వరుసల భాగ్యం

**కడప-అన్నమయ్య జిల్లాలలో ప్రస్తుతం రెండు వరుసల రహదారిగా ఉన్న సుమారు 140కిలో మీటర్ల రహదారులకు మహర్దశ పట్టనుంది. ఈ రెండు వరుసల రహదారులన్నీ నాలుగు వరుసలుగా అభివృద్ధి చెందనున్నాయి. 10రోజుల క్రితం జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రకటించిన వార్షిక ప్రణాళికలో దశాబ్దాలుగా మరణమృదంగం సృష్టిస్తున్న కడప-చిత్తూరు జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో 8కిలో మీటర్ల సొరంగాన్ని 920కోట్లతో ఏర్పాటుకు ఆమోదం లభించగా తాజాగా మరళా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ(మోర్త్) నాలుగు వరుసల రహదారులకు కూడ ఇదే వార్షిక ప్రణాళికలో పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలోనే జాతీయ రహదారులను ఎక్కువ ట్రాఫిక్ ఉన్న రహదారుల విస్తరణకు ఉద్దేశించిన ప్రణాళికలో మొత్తం 988కిలోమీటర్లు ఉండగా అందులో 931కిలో మీటర్లు నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు ఆమోదం లభించింది. అందులో సుమారు 200కిలో మీటర్లు పొడవైన రహదారులు ఉమ్మడి కడప-చిత్తూరు జిల్లాలలోనే ఉండటం విశేశం....**

**రాజంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**

జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో సిద్ధం చేసిన రహదారుల విస్తరణ ప్రణాళికలు కడప-చిత్తూరు జాతీయ రహదారి నెం.40 కూడ ఉంది. ఈ రహదారిని చిత్తూరు జిల్లాలోని రంగంపేట వరకు విస్తరించనున్నారు. ఫలితంగా కడప, రాయచోటి మధ్య ఉన్న గువ్వలచెరువు ఘాట్ రోడ్డు కూడ నాలుగు వరుసలుగా అభివృద్ధి కానుంది. అంతేకాకుండా 2004-09 వైఎస్ హయాంలో నాడు కేంద్ర మంత్రిగా ఉన్న ఏ.సాయి ప్రతాప్ ఘాట్ రోడ్డులో మలుపులు లేకుండా నేరుగా కొండలో సొరంగం(టన్నెల్) ద్వారా నిర్మించాలని శతవిధాల ప్రయత్నించారు. కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖకు పలుమార్లు విజ్ఞప్తి కూడ చేశారు. ఆ ప్రతిపాదనకు 20ఏళ్ల తరువాత ఎన్డీఏ కూటమిలో తాజాగా మోక్షం వచ్చింది. అయితే కొండ అంతర్భాగంలో రెండు వరుసల రహదారిని నిర్మిస్తారా లేక తాజాగా ఈ జాతీయ రహదారిని 4వరుసలుగ విస్తరించనున్న నేపథ్యంలో 2సొరంగాలుగా ఏర్పాటుచేసి విస్తరిస్తారా అన్నది సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) సిద్ధం చేస్తే కానీ స్పష్టత రానుంది. కడప నుంచి రాయచోటి మీదుగా పీలేరు, అక్కడి నుంచి రంగంపేట వరకు నాలుగు వరుసలుగా రహదారిని విస్తరిస్తారు. ఈ రహదారి 4వరుసలుగా నిర్మిస్తే తమిళనాడులోని రాణీపేట వరకు 148కిలో మీటర్ల దూరం ఈ రెండు జిల్లాలోనే పూర్తి అయినట్లు. ఇకపోతే ముద్దనూరు-జమ్మలమడుగు రహదారి ప్రస్తుతం రెండు వరుసలుగా ఉంది. దీన్ని కూడ 4వరుసలుగా విస్తరించనున్నారు. కాగా వారం రోజుల క్రితమే కడప-రేణిగుంట జాతీయ రహదారికి సున్నితమైన పర్యావరణ అనుమతులు కూడ లబించడంతో ఈ రహదారి పనులు కూడ త్వరలోనే ప్రారంభం అయ్యేందుకు మార్గం సుగమం అయింది. ఫలితంగా జిల్లాలోని దాదాపు ప్రధాన రహదారులు అన్ని మోర్త్ పుణ్యమా అని ఊహించని రీతిలో అభివృద్ధి జరగనున్నాయి.

### పిచ్చికుక్క దాడితో

# గాయపడిన చిన్నారి ..!

గాయపడిన చిన్నారిని వెంటనే ఆసుపత్రికి తరలింపు...

ప్రమాదంపై స్పందించిన మున్సిపల్ కమిషనర్..





**బద్వేల్ అర్బన్ జూన్ 29 ప్రభాతవార్త :**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని అపరాధి వీధికి చెందిన చిన్నారి బయట ఆడుకుంటున్న సమయములో ఉన్నఫలంగా చిన్నారిపై కుక్క దాడి చేయడంలో చుట్టుపక్కల ఉన్న ప్రజలు తల్లిదండ్రులు హుటాహుటిన కుక్క వలన అమ్మాయిని రక్షించేందుకు వెంబడించిన అక్కడి నుంచి వెళ్లిన పిచ్చికుక్క అదే వీధిలో మరి ఇద్దరిని చిన్నారులను గాయపరిచిన సంఘటన బద్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు గాయపరిచిన పిచ్చికుక్కను వెంబడించడంతో అక్కడినుంచి పారిపోయినట్లు తెలిపారు.కుక్క చిన్నారిపైదాడి చేసిన విషయం తెలిసిన వెంటనే తక్షణమే స్పందించిన మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డిసిబ్బందితో వీధులలో గాలించి గాయపరిచి కుక్కను చంపడం తో వీధివాసులు ఊపిరి పీల్చున్నారు. అనంతరం గాయపడిన చిన్నారి కుటుంబ సభ్యులతో కమిషనర్ మాట్లాడి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు, మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ అబ్బరాతి వీధిలో కుక్క దాడి చేయడంతో ముగ్గరి కి గాయాలయ్యాయి వారిని స్థానికులు వైద్య చికిత్స కొరకు ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించగా వారిని పరామర్శించేందుకు మున్సిపల్ కమిషనర్ చేరుకొని చిన్నారుల తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ అవసరమైతే మెరుగైన చికిత్సలు చేయిస్తామని హామీఇచ్చారు. అనంతరం ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి ని అడిగి వివరాలు తెలుసుకొని ప్రధమ చికిత్స చేయించి వారిని తన కారులో మెరుగైన చికిత్స కోసం స్థానికంగా ఉన్న సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో కుక్క దాడిలో గాయాలైన చిన్నారికి మెరుగైన వైద్యం చేయించారు. ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే తమను సంప్రదించాలని ఆయన తెలిపారు. కుక్క దాడిలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందజేయాలని.. బద్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ రితీష్ రెడ్డి.. బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని అబ్బ రాధివీధిలో పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారి ఆరోగ్యన్ని గురించి రితీష్ రెడ్డి వివరాలు అడిగి తెలుసుకుని అవసరమైతేమెరుగైన చికిత్స అందించాలని సంజీవిని హాస్పిటల్ డాక్టర్ కోట సుమన్ సూచించారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

### అల్లుడే కొట్టి చంపాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు



మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

**పీలేరు జూన్ 29 ప్రభాతవార్త:**

అనుమాన స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన ఆదివారం పీలేరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ లోకేష్ కథనం వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరు మండలం కాకులారం పల్లి పంచాయతీ బందా ర్లపల్లికు చెందిన శంకర్ రెడ్డి కుమారుడు విజయ్ శేఖర్‌రెడ్డికి చిత్తూరు తవణంపల్లి మండలం మంగ పల్లెకు చెందిన లోకనాథ్ రెడ్డి కుమార్తె ఇందూజ (30 )తో ఆరేళ్ల కిందట పెద్దలు సంబంధం వివాహం చేశారు. కొంతకాలం పాటు సజావుగా సాగిన వీరి కాపురం రెండు మూడు సంవత్సరాల నుంచి కలహాలు మొదలయ్యాయి. అప్పుడప్పుడు గొడవలు పడుతుండే వారని తెలిసింది .ఈ క్రమంలో శనివారం రాత్రి భార్య భర్తలు ఇరువురు గొడవ పడ్డారు.ఈ క్రమంలో ఇందుజా మృతి చెందిందని ఆదివారం వేకువ జామున భర్త విజయ శేఖర్ రెడ్డి వారి బంధువులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ మేరకు బందార్ల పల్లెకు చేరుకున్న ఇందూజా బంధువులు మృతదేహాన్ని పరిశీలించగా రక్త గాయాలతో మృతి చెందింది. అదేమని అడగడంతో విజయ శేఖర్ రెడ్డి పడక గదిలో పడుకుని ఉండగా మృతి చెందిందని ఒకసారి బావిలో దూకి ఆత్మహత్యకి పాల్పడిందని ఇంకొకసారి పొంతన లేని సమాధానం చెప్పాడు. అనుమానం వచ్చిన ఇందూజ కుటుంబ సభ్యులు పీలేరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పీలేరు పోలీసులు విచారించి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేయడంలో కేసును నీరుగారిచే విధంగా సెక్షన్లు నమోదు చేశారని బంధువులు ఆరోపించారు. దీంతో కేసు నమోదు చేయడంలో సాయంత్రం వరకు హైడ్రామా నడిచింది సమాచారం అందుకున్న రాయచోటి ఆర్డిఓ శ్రీనివాసులు, డిఎస్పి కృష్ణ మనోహర్, పీలేరు తహసిల్దార్ శివకుమార్ పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. ఈ మేరకు మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు వివరించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం మృతి గల కారణాలు తెలుస్తాయని తదుపరి చర్యలు తీసుకుంటామని వారు వివరించారు. ఇదిలా ఉంటే మృతురాలికి ఐదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు మృతి చెందిన తల్లి చుట్టూ తిరుగుతూ ఉండడం పలువురుని కంటతడి పెట్టించింది.



అభం శుభం తెలియని చిన్నారులు

# మార్కెటింగ్ వసతులు కరవు..!

- దశాబ్దాలుగా బుట్టదాఖలవుతున్న వినతులు.. - నష్టపోతున్న వాణిజ్య రైతాంగం



మదనపల్లి యార్డులో రవాణాకు సిద్దంగా టమోటాలు



రైల్వేకోడూరు యార్డులో రవాణాకు లారీకి ఎక్కించిన మామిడికాయలు

**(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)**

వాణిజ్య పంటలకు ప్రసిద్ధి చెందిన అన్నమయ్య జిల్లాలో సరైన మారె్కటింగ్ వసతులు దశాబ్దాలుగా లేవు. మార్కెట్ యార్డులున్నా వాణిజ్య రైతులకు పూర్థిస్థాయిలో మార్కెట్ పరంగా సేవలందించలేని దుస్థితిలో ఉన్నాయి. ఇక్కడ పండ్ల తోటలు పెంచుతున్న వాణిజ్య రైతాంగానికి తమ పంటలు మార్కెట్ చేసుకునేందుకు వీలుగా మార్కెట్ వసతులు మెరుగుపరచాలని రైతులు చేస్తూ వస్తున్న విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి తప్పితే సమస్య పరిష్కారం కావడం లేదు. ఉన్న మార్కెట్ యార్డులు కూడా వాణిజ్య రైతుల ప్రయోజనాలు కాపాడే స్థాయిలో సక్రమంగా పనిచేయడం లేదు. జిల్లాలోని డివిజన్ కేంద్రమైన రాజంపేటలో మార్కెట్ యార్డు మామిడి అమ్మకాలకు, కొనుగోళ్లకే పరిమితమవుతుంది. మిగిలిన నిమ్మ, అరటి, బొప్పాయి, చీనీ తదితర ఇతర పంటల విక్రయాలు, అమ్మకాలు సాగడం లేదు. రైల్వేకోడూరులో మామిడి రైతుల ప్రయోజనాల వరకు యార్డు చాలావరకు ఉపయోగపడుతుంది. మదనపల్లి డివిజన్‌లో కూడా యార్డులు పూర్తిస్థాయిలో వాణిజ్య రైతుల ప్రయోజనాలు కాపాడలేకున్నాయి. వాణిజ్య రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చే వరకు నిల్వ ఉంచుకునేందుకు వీలుగా శీతల గిడ్డంగులనైనా ఏర్పాటు చేసి ఉంటే గిట్టుబాటు ధరలు వచ్చే వరకు నిల్వ ఉంచుకునేవారు. ప్రస్తుతం ఆ వసతులు లేనందున జిల్లాలో వాణిజ్య రైతులు గిట్టుబాటు ధరలతో పనిలేకుండా పంటల దిగుబడి వచ్చిన వెంటనే విక్రయాలు చేసుకోక తప్పడం లేదు. అనేకమంది వాణిజ్య రైతులకు మార్కెట్ చేసుకునేందుకు అవగాహన లేక దళారులను నమ్ముకోవాల్సి వస్తోంది. శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయమని స్థానిక ప్రజాప్రతినిధుల మొదలు ముఖ్యమంత్రుల వరకు దశాబ్దాలుగా చేస్తూ వస్తున్న విజ్ఞప్తులు చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందంగా మారుతోంది. జిల్లాలో వాణిజ్య రైతులు పండించే అన్ని రకాల పంటలకు మార్కెట్ చేసుకునేందుకు వీలుగా మెరుగుపరచాల్సి ఉంది. మార్కెట్ వసతులు మెరుగుపరిచి రైతులను ఆదుకోవాలని దశాబ్ధాల నుండి చేస్తూ వస్నున్న సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పడిఉంది. మార్కెట్ వసతులు మెరుగుపరిస్తే ప్రస్తుతం జిల్లాలో చైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారమార్గమవుతో ంది. అంతేకాకుండా దళారులను నమ్మి రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీలవుతుంది. సరైన దిశలో ఇక్కడి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం శ్రద్ధచూపని కారణంగా అక్షరజ్ఞానం తక్కువగా ఉన్న ఇక్కడి రైతులు ప్రతి ఏటా నష్టపోతూ వస్తున్నారు. సొంతంగా మార్కెటింగ్ చేసుకునే శక్తి సామర్థ్యాలు, అవగాహన తక్కువశాతం రైతులకే ఉంది. దీంతో దళారులను నమ్ముకొని తమ పంటను మార్కెట్ చేసుకునే దుర్గతి రైతులుకు తప్పడం లేదు. దీంతో దళారుల ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించి రైతుల ప్రయోజనాలు దెబ్బతీస్తున్నట్టు ఆరోపణలున్నాయి. దశాబ్దాలుగా వాణిజ్య రైతుల కష్టాలు గుర్తెరిగి ఇక్కడి ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా రైతుల ప్రయోజనాల విషయంలో సరైన దిశలో స్పందించాల్సి ఉంది. వెంటనే మార్కెటింగ్ వసతులు మెరుగుపరిచేందుకు అన్ని మార్కెట్ యార్డులను పూర్తిస్థాయిలో అభివృద్ధిపరచడం, శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయడం, గిట్టుబాటు ధరలపై అవగాహన చర్యలు చేపట్టడం లాంటివి సత్వరం చేపట్టాల్సి ఉంది. కాగా ప్రస్తుతం ఉన్న మార్కెట్ యార్డుల పనితీరు కూడా లోపభూయిష్టంగా ఉంది. సిబ్బంది కూడా అక్రమార్జనకు అలవాటుపడి రైతుల గోడు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం కూడా వాణిజ్య రైతుల ప్రయోజనాలే ప్రాతిపదికగా వారు ఎదుర్కొంటూ వస్తున్న సమస్యలను గుర్తెరిగి మార్కెట్ యార్డుల అభివృద్ధికి వీలుగా ప్రత్యేక నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

## అనుమతులు లేకుండా టపాసులు అక్రమ వ్యాపారం

**మైదుకూరు, జూన్ 29, ప్రభాతవార్త:**

మైదుకూరు మున్సిపాలిటీలోని బద్వేల్ రోడ్డు పెట్రోల్ బంకు దగ్గర ఓషాపులో అనుమతులు లేకుండా టపాసులు దాచడంతో పేలినట్లు స్థానికుల సమాచారం. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు తెలిపారు. దీపావళి పండుగ సమయంలో మున్సిపాలిటీ పరిధిలో అనేకచోట్ల షాపులలో అనుమతులు లేకుండా వ్యాపారం చేయడం పండుగ అనంతరం అవి ఎక్కడో ఒకచోట దాచడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అక్రమ వ్యాపారస్తులు దర్జాగా వ్యాపారాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అనుమతి లేని వ్యాపారాలపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు. అంతేకాకుండా పటాసులు అధిక మొత్తంలో మైదుకూరు ప్రాంతంలో దొంగ వ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం. అధిక మందు గుండు పటాసుల సౌండ్ ఉండాలని ఎక్కువ మొత్తంలో టపాసులు సౌండ్ రావడంతో కొంతమంది వాటిపై దొంగ వ్యాపారంపై మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. ఈ మధ్యకాలంలో ఓ ఉత్సవంలో అధిక సంఖ్యలో టపాసులు పేలడంతో ఒక విద్యార్థికి గాయాలైనట్లు అందరికీ తెలిసిందే ఇప్పటికైనా ఇలాంటి వ్యాపారస్తులపై చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా అధిష్టానం దృష్టికి తీసుకెళ్తా

**చిన్నమండెం జూన్ 29 ప్రభాత వార్త:**

నేను తెలుగుదేశం పార్టీలోనే ఉంటా...నా తండ్రి దివంగత నేత రాయచోటి టిడిపి సీనియర్ నాయకులు స్వర్గీయ శ్రీ సుగవాసి పాలకొండ్రాయుడు గారు సూచించిన అడుగుజాడల్లోనే నడుస్తానని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం టీడీపీ సీనియర్సు నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు గారు అన్నారు చిన్నమండెం మండలంలోని మల్లూరు కొత్తపల్లి మరియు మల్లూరు, శ్రీరామనగర్ ప్రజలు నిర్వహించిన పెద్దాయన పాలకొండ్రాయుడు గారి సంస్మరణ సభలో సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్ళిన, ఏ పల్లెకు ఈ పనులన్నీ మీ తండ్రి గారు చేసినవేనని ఆగ్రామస్తులు చెబుతుంటే నాకు ఎంతో తృప్తి కలిగించిందని మారుమూల గ్రామానికి వెళ్ళిన పాలకొండ్రాయుడు గారు చేసిన అభివృద్ధి కనపడుతుందన్నారు తన తండ్రి పార్టీ పెట్టిన నాటి నుండి తుది శ్వాస విడిచే వరకు పార్టీలోనే కొనసాగారని పార్టీని పాలకొండ్రాయుడు గారిని ఇక్కడి ప్రజలు ఏనాడూ వేరుగా చూడలేదన్నారు తనను కొందరు టిడిపి నుంచి వెళ్ళగొట్టాలని చూస్తున్నారని తాను టిడిపిలోనే కొనసాగుతానని మాకు జరుగుతున్న అన్యాయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం ఎవరైతే కష్టపడ్డారో స్థానిక సంస్థల ఎన్నికల్లో వారందరికీ అవకాశాలు కల్పించే విధంగా తాను అధినాయకత్వంతో మాట్లాడుతానన్నారు నా తండ్రిని ఏవిధంగా ఆదరించారో తనను కూడా మీ కుటుంబ సభ్యుడిలో ఒక్కడిగా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన పార్టీ లైన్ దాటకుండా నిబద్ధతతో తమ కుటుంబం పని చేసిందన్నారు, చిన్నమండెం ప్రజలన్న ఈ ప్రాంతం అన్న మా తండ్రికి మా కుటుంబానికి ఎనలేని



అభిమానం ఎందుకంటే ఈ ప్రాంత వాసులు ఆత్మ అభిమానాన్ని కోరుకుంటారే తప్ప బెదిరింపులకు భయపడరన్నారు,ప్రతి వ్యక్తిని పేరుపేరునా గుర్తుపెట్టుకుని పిలిచే అంత చనువు మా తండ్రికి మీతో ఉండేది... ఆయన వారసునిగా వచ్చిన నాకు అదే స్థాయిలో మీరు గుర్తింపు ఇవ్వడం నేను చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాను, గ్రామాలలోని అన్ని వర్గాల ప్రజలను చేరదీస్తూ... మీలో ఒకడిగా, మీరిచ్చిన ధైర్యంతో రాజకీయాలలో ముందుకు సాగిన మా తండ్రి లాగానే మీ బిడ్డగా నేడు మీ ముందుకు వచ్చాను. నన్ను కూడా మీ బిడ్డ లాగానే చేరదీసి ముందుకు నడిపిస్తారని విన్నవించుకుంటునన్నారు, తమను రాజకీయంగా ఎవరైతే దెబ్బతీశారో వారికి తప్పనిసరిగా రాజకీయంగానే బుద్ధి చెబుతామని అన్నారు, ఇక్కడికి వచ్చిన ప్రజలను చూస్తుంటేనే అర్థమవుతుంది పాలకొండరాయుడు గారి మీద ఎంత అభిమానం ఉందో తెలుస్తుందన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ధన్యవాదములు తెలియజేసారు.

# గురుకుల పాఠశాల తరలించడం సబబుకాదు



**పోరుమామిళ్ల రూరల్, జూన్ 29ప్రభాతవార్త:**

దాదాపు 30 సంవత్సరాల నుంచి ఎటువంటి సమస్యలు లేకుండా బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి కోడూరు మండల విద్యార్థులకు అతి దగ్గరగా అన్ని వసతులతో చక్కగా రూపొందించిన సగిలేరు గురుకుల పాఠశాలను తరలించడం మంచిది కాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పీసీసీ, సభ్యులు పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు అన్వర్ పేర్కొన్నారు. ఈ పాఠశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు కొన్ని వేలమంది విద్యార్థులకు విద్యా బోధన అందించిందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు మహా గురుకులం పేరుతో తోట్లపల్లిలో ఉన్నటువంటి గురుకుల పాఠశాలలో విలీనం చేయడం సబబు కాదని, తోట్లపల్లి గురుకుల పాఠశాలలో సగిలేరు గురుకుల విద్యార్థులను కలిపిన తోట్లపల్లి గురుకుల పాఠశాలలో భవనాలు, సదుపాయాలు ఆ మేరకు లేవని ఆయన గుర్తు చేశారు. సగిలేరులో ఉన్నటువంటి భవనాలను మరమ్మత్తులు చేసి ఇక్కడే అన్ని సదుపాయాలను సమకూర్చి బద్వేల్ నియోజకవర్గానికి ఉన్న ఏకైక గురుకుల పాఠశాల అయిన, సగిలేరు పాఠశాలను తరలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. బద్వేల్ నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల విద్యార్థులకు అనుకూలంగా ఉండి అన్ని వసతులతో ఉన్న, ఈ పాఠశాలను తరలించకుండా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.

## కనమర్లపూడి రామ సుబ్బారావును పరామర్శించిన బిజెపి నాయకులు



**పోరుమామిళ్ల రూరల్, జూన్ 29 ప్రభాత వార్త:**

ఇటీవల ఆయనకు అనారోగ్యం గురై కర్నూల్ కామినేని హాస్పిటల్ నందు చికిత్స పొంది పోరుమామిళ్లలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి సీనియర్ నాయకులు కన మర్లపూడి రామ సుబ్బారావును ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణాచారి, బద్వేల్ అసెంబ్లీ కో కన్వీనర్ పల్లంశెట్టి పండరి, పోరుమామిళ్ల బిజెపి మండల అధ్యక్షుడు నారిసెట్టి నాగేంద్ర లు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రధాన కార్యదర్శి వంకదారి జయరాం, మండల ఉపాధ్యక్షుడు కందుకూరి చెన్నయ్య, జనసేన మండల కార్యకర్త తమ్మిశెట్టి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవతా శాఖ నూతన కమిటీ ఎన్నిక.

**చిట్వేలి, జూన్ 29, ప్రభాతవార్త:**

చిట్వేలి మానవత శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నెలవారి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తిరుమల విశ్వనాథం, కార్యదర్శి కుంభగిరి ముని రావు, ట్రెజరర్ రామిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, చైర్మన్ కే సాయిరాం, కో చైర్మన్ తురక రంగారెడ్డి, గౌరవ డైరెక్టర్ గుత్తి నరసింహ, డైరెక్టర్ బోర్డ్ గూడూరు సుబ్బరాజు,సంయుక్త కార్యదర్శి కంచర్ల సుధీర్ రెడ్డి,అడ్వెంచరీ బోర్డు మెంబర్ కావేరి చంద్ర అడ్వెంచరీ బోర్డు మెంబర్ సువారపు హరిప్రసాద్ తదితరులను మానవత చిట్వేలి శాఖ తీర్మానం చేసింది. ఎన్నిక కాబడ్డ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకార ప్రతిజ్ఞ చేశారు. శాఖ ఆధ్వర్యంలో సేవలను విస్తృతంగా చేపడుతామని కమిటీ సభ్యులు తెలిపారు.



# పోరుమామిళ్ళకు మచ్చా నాగ మల్లేశ్వరి

**పోరుమామిళ్ల రూరల్, జూన్ 29 ప్రభాతవార్త:**

పోరుమామిళ్ళకు ఆదివారం విచ్చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షురాలు మచ్చా నాగ మల్లేశ్వరి వచ్చిన సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ. ముత్యాల ప్రసాద్, పోరుమామిళ్ల మండలం జడ్పిటిసి జి శ్రీనివాసులు, చాటకొండ విజయ్, నాగదాసరి వీరయ్య, కేశవ, పెట్లు వెంకటేశ్వర్లు, యువ నాయకులు పాల్గొన్నారు.



# తంబళ్లపల్లె మండల రథసారథి ఎంపిక పై కసరత్తు

## క్షేత్రస్థాయిలో పరిశీలకుల అభిప్రాయ సేకరణ... అధిష్టానం తుది నిర్ణయమే ఫైనల్.

**తంబళ్లపల్లె జూన్ 29 ప్రభాతవార్త :**

తంబళ్లపల్లె మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష పదవి ఎంపిక రసవత్తరంగా మారింది. అధ్యక్ష ఎంపికపై పార్టీ పరిశీలకులు మండలంలో క్షేత్రస్థాయిలో టిడిపి నాయకులు, కార్యకర్తల అభిప్రాయ సేకరణ పూర్తయి తుది నివేదికలు అధిష్టానం చెంతకు చేరాయి. మండల అధ్యక్ష పదవి ఆశిస్తున్న నాయకులు పార్టీ అధిష్టానం తుది నిర్ణయమే శిరోధర్యమని వేచి చూస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో పరిశీలకులకు పాత, కొత్త నాయకుల అభిప్రాయాలు, విశ్లేషణలు, భేదాభిప్రాయాలు, పార్టీ కోసం పడిన కష్ట నష్టాలు వారి దృష్టికి వచ్చాయి. అయితే నేడు పరిస్థితులు వేరు వైకాపా తరపున బలమైన పెద్దిరెడ్డి కుటుంబం ఉండి గత నాయకుల వైఫల్యంతో టీడీపీ బలహీనపడింది. నేడు తంబళ్లపల్లె ఇంచార్జ్ జయ చంద్రారెడ్డి సారథ్యంలో తాను ఓటమి చెందినా తెలుగుదేశం పార్టీకి జీవం పోసి నియోజకవర్గంలోని నాయకులను కలుపుకుంటూ అందరిని ఒక తాటిపైకి తేవడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాడు. నేటి పార్టీ పరిస్థితులను ఎదుర్కోవడానికి మండల స్థాయి నాయకుడు ఆర్థిక, అంగబలంతో పాటు బలమైన వర్గం ఉంటేనే వైకాపాను ఎదుర్కొనే పరిస్థితి ఉంటుంది. మండల నాయకుడికి పోరాడేతత్వంతో పాటు కార్యకర్తలలో నమ్మకం, వారిని ఆదుకోవడంతో పాటు పార్టీ అధిష్టానం, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదేశాలు నిస్వార్థంగా పాటించే చురుకైన స్వభావం కలిగి ఉంటే వైకాపాను అలవోకగా ఎదుర్కోవచ్చు. నేడు అధికారం కూటమి చేతిలో ఉంది. బలమైన యువ నేత తంబళ్లపల్లె ఇంచార్జ్ జేసీఆర్ ఉన్న తరుణంలో మండలంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి పాత, కొత్త కలయికతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేసి తంబళ్లపల్లె



మండలానికి ట్రైటైనా టిడిపి నాయకుడిని ఎన్నుకుంటారని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**దువ్వూరు, జూన్ 29, ప్రభాతవార్త:**

మండల పరిధిలో ఎవరైనా ఘర్షణ పడి చిన్న చిన్న కేసులు నమోదైన వారు ఈ నెల 5వ తేదిన జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ నెల 5న మైదుకూరు కోర్టు నందు లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని ఇందులో ఇచ్చే తీర్పు సుప్రింకోర్టు తీర్పుతో సమానం అన్నారు. ఏదైనా కేసులు నమదైన ఇరువర్గాలు వచ్చి తమ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై గ్రామాలలోని కక్షిదారులకు అవగాహణ కల్పిస్తున్నాని ఇరువర్గాలు తమపై ఉన్న కేసులను చర్చించుకొని పరిష్కరించుకోవాలని అన్నారు.

## మాధురి హై స్కూల్ కస్పాండెంట్‌కు మదర్ తెరిస్సా అవార్డు



**సుండుపల్లె, జూన్ 29, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని మాధురి హై స్కూల్ కరస్పాండెంట్ రేపన్న సుధాకర్ కు న్యూఢిల్లీలోని ప్రముఖ ఫేస్ గ్రూపు సంస్థ వారు నిర్వహించిన జాతీయ సదస్సులో మదర్ తెరిసా అవార్డు ప్రధానం చేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఢిల్లీ క్యాబినెట్ మంత్రి మజీందర్ సింగ్ మరియు బాలీవుడ్ సంబంధించిన అనేకమంది సంగీత కళాకారులు, సినీ పరిశ్రమకు సంబంధించినటువంటి పలువురు పాల్గొనడం జరిగిందని, ఇదే కార్యక్రమంలో అందాల పోటీలు నిర్వహించడం జరిగిందని, ఈ పోటీలో భాగంగా మొదటి మూడు బహుమతులను ప్రధాన ఉత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ మొహమ్మద్ రఫీ అంతర్జాతీయ పీస్ అంబాసడర్ మరియు మొదలగువారు పాల్గొన్నారు.

## ఇక ఇంటింటికి తెలుగుదేశం

# ప్రజల్లో ఉండే నేతలకే భవిష్యత్తు : జగన్మోహన్ రాజు



మంగళగిరి తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న జగన్ మోహన్ రాజు

**రాజంపేట, జూన్ 29 ప్రభాతవార్త**

ఇక ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంతో జనంలోకి వెళ్లి ఏడాది కాలంలో రాష్ట్రంలో కుటుం చేసిన సంక్షేమ కార్యక్రమాలను, మంచి పనులను, ప్రజల కోసం ఏమి చేస్తున్నామో వివరించేందుకు కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ అధినేత ఆదేశించినట్లు టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్రాజు వెల్లడించారు. మొదట రాజంపేట నియోజకవర్గంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళతామని ఆయన అన్నారు.టిడిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో చమర్తి పాల్గొన్నారు. జూలై రెండవ తేదీన నుండి ప్రతి ఇంటికి ప్రజలకు దగ్గరయ్యే విధంగా కూటమి ప్రభుత్వంలో ఏడాదిలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాల గురించి ప్రభుత్వం అమలు చేస్తున్న మెగా డీఎస్సీ, పింఛన్లు, ఇండ్లు, గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ , ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఆర్టీసీ బస్సులో ఫ్రీగా ప్రయాణించడం ఇంకా మరెన్నో పథకాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని ఆదేశించారన్నారు.ఈ సమావేశంలో మంత్రులకు ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, ఇన్చార్జిలకు, దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రజల్లో ఉంటేనే నేతలకు భవిష్య త్తు ఉంటుందని పార్టీ అధినేత స్పష్టంగా తెలిపినట్లు వివరించారు. నియోజవర్గంలో పార్టీ శ్రేణులు, నాయకులు ,కార్యకర్తలు, క్రియాశీలక సభ్యులు, మొత్తం తెలుగుదేశం కుటుంబ సభ్యులు పార్టీ అధినేత ఆదేశాల మేరకు రెండో తేదీ నుంచి ఇంటింటికి తెలుగుదేశం లో పాల్గొనేందుకు సమాయత్తం కావాలని జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు.

# అయ్యప్పకు అర్ధ మండలం పాటు పూజలు

**రాజంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**



రాజంపేట పట్టణం జాతీయ రహదారి మణికంఠ నగర్‌లో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో షిర్డిసాయి బాబా విగ్రహ పున: ప్రతిష్టతో పాటు అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆదివారం నాటికి అర్ధ మండలం పూర్తి అయ్యాయి. మండలం పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాల్సి ఉంది. 20రోజుల పాటు ప్రతి రోజు అయ్యప్ప మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలను నిర్వహిస్తున్నారు. మరో 20రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని ఆలయ గురుస్వామి కోండా సత్యనారామణ, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పాలప్రకాష్, దాము ఆచారి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6నుంచి 10గంటల వరకు అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అభిషేక పూజల్లో పాల్గొని అయ్యప్ప కృపకు పాత్రులు కావాలని కోరారు.

# పోలీలో వైభవంగా గంగమ్మ జాతర

**రాజంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**



రాజంపేట మండలం పోలీలో గంగమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. చాలా కాలం తర్వాత జాతరకు చుట్టు ప్రక్కల గ్రామాల వారు సమాయత్తం కావడంతో జాతర కోలాహలంగా జరిగింది. పండుత వాతావరణం నెలకొంది. శనివారం రాత్రి నుంచే జాతర సన్నాహాలు మొదలయ్యాయి. రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము నాటిని గ్రామ దేవత గంగమ్మ తల్లి గద్దె ఎక్కారు. ఈ సంధర్భంగా ఆలయ అర్చకులు గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించారు. జాతరతో పోలీ గ్రామంలో ప్రతి ఇంట సందడి నెలకొంది. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కూడ జాతరకు తరలివచ్చారు.

## నందలూరులో 25లక్షలు విలువ చేస్తే

# బంగారు నగలు స్వాధీనం

## ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

**రాజంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**

జనం ఎక్కడ ఉంటే ఆ ముగ్గురు దొంగలు అక్కడ ప్రత్యక్షం అవుతారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఉండే కూడళ్లను, బస్టాండ్‌లను ఎంపిక చేసుకుంటారు. సందట్లో సడేమియా అంటూ బ్యాగులు దోచుకుంటారు. బంగారు నగలు మాయం చేస్తారు. ఇదే వారి పని. సత్యసాయి జిల్లా నంబూలపులికుంటకు చెందిన ఆవుల సంజీవ్, ఆవుల ఈశ్వరమ్మ, ఆవుల ప్రమీళ అనే అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి 25 లక్షలు విలువ చేసే బంగారు నగలతో పాటు 14వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ వెల్లడించారు. నందలూరు బస్టాండ్‌లో ఓ మహిళ దగ్గర ఉన్న బ్యాగు చోరి అయిందన్నారు. మరళా అక్కడే మరో మహిళ బ్యాగులో ఉన్న 14వేల నగదు దొంగలించారన్నారు. అంతే కాకుండా వేంపల్లె, పులివెందుల, అనంతపురం త్రీ టౌన్, నంద్యాల వన్ టౌన్‌లో కూడ ఇదే విధంగా దొంగతనాలు జరిగాయన్నారు. నందలూరు బస్టాండ్‌లో జరిగిన దొంగతనాలపై నందలూరు ఎస్ఐ వి. మల్లికార్జున రెడ్డి కేసు నమోదు చేశారన్నారు. దొంగల కోసం ప్రత్యేకంగా సీసీఎస్ సీఐ ఎం.చంద్రశేఖర్ తాను నందలూరు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి కలిసి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. ఈ క్రమంలోనే నందలూరు సమీపంలోనే దుర్గాపురం కాలనీ వద్ద సంజీవ్, ఈశ్వరమ్మ, ప్రమీళలు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడి చేసి వారి ముగ్గురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పలుచోట్ల జరిగిన దొంగతనాలు వీరే చేసినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి 250గ్రాముల బంగారు, 14వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన నందలూరు ఎస్ఐతో పాటు మిగతా పోలీసుల వివరాలను రివార్డు నిమిత్తం జిల్లా ఎస్పీకి సిఫార్సు చేసినట్లు సీఐ వెల్లడించారు. నిందితులను పట్టుకున్న పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.



## ఉద్దిమడుగు రిజర్వాయర్ నిర్మించకుండానే

# 34కోట్లు భూసేకరణకు నిధులా?

## వైసీపీ నేత కుంభకోణంపై ప్రభుత్వానికి ఫిర్యాదు

**రాజంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**

గాలేరు-నగరి రెండవ దశ ప్రాజెక్టు కింద ఉద్దిమడుగు రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉందని అయితే ఈ పనులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడ చెల్లించలేదని అలాంటప్పుడు భూసేకరణలో తప్పుడు క్లెయిమ్‌లతో 34కోట్లు కాజేసేందుకు ఓ వైకాపా నేత ప్రభుత్వం నుంచి సానుకూలంగా నివేదిక మంజూరు చేయించుకున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ రాష్ట్ర కల్లుగీతా ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకటనరసయ్య వెల్లడించారు. ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్దిమడుగు రిజర్వాయర్ నిర్మాణాలు జరగలేదని తెలిపారు. ఇప్పటికై వైకాపా నేత దొంగ పట్టాలతో గతంలో పనిచేసిన సిద్ధవటం రెవెన్యూ అధికారులు ఇచ్చిన తప్పుడు కరపత్రాలతో డీకేటి పట్టాలతో 13కోట్లు పరిహారం పొందారని తెలిపారు. మరళా 34కోట్లు చెల్లించేలా రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ జీ.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. ఇది పెద్ద కుంభకోణం అని వైకాపా నేతకు ఆ భూములు ఎలా వచ్చాయో గతంలో ఇచ్చిన పరిహారం పత్రాలు చూస్తే స్పష్టం అవుతుందని తెలిపారు. ఈ కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కుంభకోణంపై ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

# లిచీతో ఎన్నో ప్రయోజనాలు

రోడ్డు పక్క బండ్లపై ఎక్కడ చూసినా లిచీ పండ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి కదూ! ఎరుపు, తెలుపు మేళవింపుతో జెల్లీలా కనిపిస్తూ తెగ నోరూరిస్తాయి. మరి తింటున్నారా? ఎందుకంటే.. ఈపండ్లు మనకి బోలెడు ఆరోగ్య ప్రయోజనాలని అందిస్తాయి.

- చినుకులు మొదలయ్యాయి. వాటితోపాటే బోలెడు ఇన్‌ఫెక్షన్లూ పలకరిస్తాయి. వాటి బారిన పడొద్దంటే రోగనిరోధకత పెంచుకోవాల్సిందే. లిచీలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇమ్యూనిటీని పెంచడంలో సాయపడుతుంది.
- బి విటమిన్లు, ఫ్లావనాయిడ్లు సమృద్ధిగా ఉంటాయి. రక్తకణాల ఉత్పత్తికి ఇవి సాయపడతాయి. అందుకే నెలసరి మొదలైన అమ్మాయిలకు వీటిని తప్పక ఇవ్వమంటారు. ఇంకా మాంగనీస్, మెగ్నీషియం, కాపర్, ఐరన్, ఫోలేట్ వంటి ఖనిజలవణాలకు ఇది మంచి వనరు. పైగా రుచీ బాగుంటుంది. అందుకే ప్రెగ్నెన్సీ సమయంలో తప్పక ఇవ్వాల్సిన పండ్లలో వీటినీ ఒకటిగా చెబుతారు.

# 'డబుల్ చిన్'కు చెక్ పెట్టేద్దాం !



**అందం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. కొన్ని చిన్న చిన్న సమస్యలు ముఖాకృతిని దెబ్బతీస్తుంటాయి. డబుల్ చిన్ కూడా అలాంటిదే! గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం వల్ల అదనపు లేయర్‌లా కనిపిస్తుంటుంది. ఈ** సమస్యతో నలుగురిలోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతుంటారు కొందరమ్మాయిలు. అయితే కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తూ డబుల్ చిన్‌ను సులభంగా తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.

అవేంటో తెలుసుకుందాం రండి.

ఎందుకిలా?... డబుల్‌చిన్ రావడానికి ముఖ్యంగా 3 కారణాలున్నాయని చెబుతున్నారు నిపుణులు.

- అధిక బరువు-ఆకస్మాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం వల్ల ఈ సమస్య వస్తుంది. బరువు పెరిగినప్పుడు గడ్డం దగ్గర కొవ్వులు పేరుకుపోవడం, తగ్గినప్పుడు అక్కడి చర్మం వదులుగా మారడమే ఇందుకు కారణం.
- వంశపారంపర్యంగా డబుల్ చిన్ రావడానికి జన్యుపరమైన కారణాలూ ఉన్నాయంటున్నారు నిపుణులు.
- వయసు పైబడడం-వయసు పెరుగుతున్న కొద్దీ ముఖ కండరాలు దృఢత్వాన్ని కోల్పోవడం, తద్వారా గడ్డం కింద కొవ్వు పేరుకుపోవడం, అక్కడి చర్మం వదులువడం వల్ల కూడా డబుల్ చిన్ వస్తుందట!

**ఇంటి చిట్కాలతో ఉపశమనం!..** బాగా నమలండి..!: డబుల్ చిన్ సమస్యతో బాధపడే వారు ఆహారాన్ని బాగా నమిలి మింగాలి. ఇలా చేయడం వల్ల ముఖ కండరాలకు వ్యాయామం అంది పటిష్టంగా తయారవుతాయి. దీనివల్ల అదనపు కొవ్వులు పేరుకుపోకుండా చక్కటి ముఖాకృతిని సొంతం చేసుకోవచ్చు. అలాగే మార్కెట్లో లభించే షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్స్ నమలడం కూడా మంచిదే తద్వారా దవడల దగ్గర పేరుకున్న కొవ్వు సులభంగా కరుగుతుంది.

**తెల్లసొనతో..** రెండు గుడ్లలోని తెల్లసొన, ఒక టేబుల్‌స్పూన్ పాలు, కొద్దిగా తేనె-నిమ్మరసం.. ఇవన్నీ బాగా కలిపి ఈ మిశ్రమాన్ని డబుల్ చిన్ ఉన్న చోట ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. అలా 30 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తెల్లసొన చర్మాన్ని బిగుతుగా మారుస్తుంది. ఇలా తరచూ చేయడం వల్ల డబుల్ చిన్ క్రమంగా తగ్గుముఖం పడుతుంది. గుడ్డు వాసన నచ్చని వారు ఈ మిశ్రమంలో కొన్ని చుక్కల ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కూడా కలుపుకోవచ్చు.

**గ్రీన్ టీ.....** గ్రీన్ టీ శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తుంది. చెడు కొవ్వును కరిగిస్తుంది. కాబట్టి కాఫీ, టీలకు బదులుగా గ్రీన్ టీని డైట్‌లో చేర్చుకుంటే డబుల్ చిన్‌ను క్రమంగా తగ్గించుకోవచ్చు.

**విటమిన్ 'ఇ'....** మనం రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్ 'ఇ' ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. బ్రౌన్ రైస్, ఆకుకూరలు, పాల ఉత్పత్తులు, స్వీట్ కార్న్, యాపిల్, సోయా బీన్స్, పప్పు దినుసులు.. ఇలాంటి వాటిల్లో విటమిన్ 'ఇ' ఎక్కువగా లభిస్తుంది. కాబట్టి వీటిని తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి.

**నీళ్లు ఎక్కువగా ...** రోజుకు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఉండే కొవ్వుతో పాటు దావడ, గడ్డం కింద పేరుకున్న అనవసర కొవ్వులు కూడా కరిగిపోతాయి. అలాగే నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్ల కూడా ఆహారంలో చేర్చుకోవాలి.

**ఈ వ్యాయామాలతో...** 1. ఎక్కువగా నవ్వడం, మాట్లాడటం వల్ల కూడా ముఖ కండరాలకు చక్కని వ్యాయామం అందుతుంది. తద్వారా డబుల్ చిన్‌నూ తగ్గించరకోవచ్చు.

2. మెడ గుండ్రంగా, నెమ్మదిగా కొద్ది సమయం పాటు తిప్పడం, పైకి-కిందకు కదిలించడం.. వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేసినా ఫలితం ఉంటుంది. 3. అలాగే క్యాలరీలు, కొవ్వులు లేని ఆహార పదార్థాల్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.



# బద్వేలు పట్టణ ప్రజలకు సదుపాయములను మెరుగుపరచాలి

బద్వేల్ అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త

పట్టణంలోని పట్టణ అభివృద్ధి సొసైటీ కార్యాలయం లో ఆదివారం అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యవర్గ సమావేశము జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు త్రాగునీరు, పారిశుధ్యము,రోడ్ల నిర్మాణము మెరుగుపరచి ప్రజలు ఆరోగ్యకరంగా జీవించునట్లు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధాన కార్యదర్శి బద్వేలు గురుమూర్తి మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, పట్టణ ప్రజలను పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మొదలగు విషయాల పట్ల అవగాహన కల్పించుటకు వార్డుల సందర్శన, కరపత్రముల ద్వార చైతన్యం చేస్తామన్నారు. పట్టణంలో కుక్కల, పందుల బెడద నుండి ప్రజలను కాపాడాలని కోరారు. కార్యదర్శి సత్తార్ మాట్లాడుతూ పట్టణంలో గ్రంథాలయానికి ప్రభుత్వ భవనం కట్టించాలని, యన్.జి.ఒ కాలనీ లో వున్న ఎ 0.96 సెంట్ల మున్సిపాలిటీ స్వాధీనంలో వున్న పబ్లిక్ స్థలంలో పార్కును ఏర్పాటుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అడ్వకేట్ మురళి, కోశాధికారి పి.శ్రీనివాసులు రెడ్డి,కార్యదర్శి యస్.ఈశ్వరయ్యలు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో గౌరవాధ్యక్షులుగా డా.గానుగపెంట హనుమంతరావు, కొండపల్లి చిన్న సుబ్బారావులను, ఉపాధ్యక్షులుగా డా.బి.కృష్ణ, కార్యదర్శిగా యస్.ఈశ్వరయ్య, నూతన కార్యవర్గ సభ్యులు గా సి.నారాయణ, ఒ.యస్.వి ప్రసాద్,తోట రాము,ఆవుల వెంకటే, షేక్.అన్వర్ బాషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# బిసిల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

## బిసి నాయకులు రాజశేఖర్, రెడ్డిసాహెబ్‌లు



సమావేశంలో సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :

బిసిల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం అవుతుందని బిసి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బి.రాజశేఖర్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, బిసి నాయకులు షేక్ రెడ్డిసాహెబ్‌లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీక్రిష్ణ కళ్యాణమండపంలో జరిగిన బిసిల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 240 బిసి కులాలకు చెందిన వారు అందరూ కులాన్ని వదలి బిసి కులంగా ఏకతాటిపై వచ్చి తమ గళాన్ని వినిపిస్తే రాజ్యాధికారం సాధ్యం అవుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి తరహాలోనే బిసిలకు ప్రత్యేక చట్టం తీసుకురాలన్నారు. ఎస్‌టి, ఎస్‌టి రిజర్వేషన్ నియోజకవర్గాల లాగానే బిసిలకు కూడా బిసి రిజర్వేషన్ నియోజకవర్గ స్థానాలను కేటాయించాలన్నారు. బిసిలకు రాజ్యాధికారం హక్కుగా పొందడానికి వీలు అవుతుందన్నారు. బిసి వర్గాలకు విద్యలో, రాజకీయాల్లో, ఉపాధి అవకాశాల్లో జనాభా ధామాస ప్రకారం ప్రభుత్వాలు ప్రాధాన్యత కల్పించాలన్నారు. బిసిలను జీవితాంతం ఓటుబ్యాంకు గానే చూస్తున్న అనేక పార్టీలు బిసిలకు వారి హక్కులు కల్పించే విధంగా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామంలో బిసిలకు కమ్యూనిటి హాలు నిర్మించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టి కులాల వర్గాల వారీగా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పార్టీకి కష్టపడి పనిచేసిన వారికే పదవులు.



రామసముద్రం జూన్ 29 ప్రభాతవార్త

టిడిపి ప్రభుత్వంలో పార్టీ కి పనిచేసిన వారికే పదవులు దక్కుతాయని రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు స్పష్టం చేశారు. ఆదివారం రామసముద్రం మండలానికి విచ్చేసిన ఆయన పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్టీ సంస్థాగత ఎన్నికలలో గత వైసిపి ప్రభుత్వ పాలనలో అక్రమ కేసులలో చిక్కుకున్నవారికి,సర్పంచులుగా పోటీ చేసి ఓడిపోయిన వారికి, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే గత సార్వత్రిక ఎన్నికలలో టిడిపి పార్టీకి పనిచేయని వారికి, కొంత మంది వైసిపి సానుభూతి పరులకు అన్ని విధాలా ప్రాధాన్యత ఇస్తున్నారనీ, నిజమైన టీడీపి నాయకులకు,కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని కొందరు శ్రీరామ్ చినబాబుకు పిర్యాదు చేసారు, ఈ విషయంపై స్పందించిన చినబాబు కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్న ఏ నాయకునికి, కార్యకర్తలకు అన్యాయం జరగదని, అలాంటి పరిస్థితి వస్తే తాను అండగా ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవత నెలవారి సమీక్ష సమావేశం



మానవతా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ప్రమాణం చేస్తున్న దృశ్యం

పీలేరు జూన్ 29 ప్రభాతవార్త :

పట్టణంలోని మానవతా సంస్థ అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన, చైర్మన్ వి రామచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించ బడింది. ఈ సమావేశంలో చర్చించిన విషయములు. పీలేరు మండలంలో మండల స్థాయిలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుతులు ఇవ్వడానికి నిర్ణయించడ మైనది. అదేవిధంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జులై మాసంలో ప్రారంభించి నెలాఖరుకు పూర్తి చేయుటకు నిర్ణయించి సభ్యులకు పుస్తకాలు అందించడం జరిగింది. ప్రభుత్వ బడులలో అత్యధిక నమోదు చేయబడిన పాఠశాలలను అభినందించుటకు తీర్మానించారు. అలాగే గతంలో చేసిన వినూత్న కార్యక్రమాలపై సమీక్ష చేయడం జరిగింది అదే విధంగా రాబోయే కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలకు కావలసినఆర్థిక సర్దు బాట్లును కూడా చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ వి. రామచంద్ర, కో చైర్మన్, కృష్ణమూర్తి, అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు జీవీ రమణ పెంజూరి అశోక్,హరి కుమార్,అక్రమ భాష, నాగరాజ. పోతంశెట్టి రమేష్, రెడ్డప్ప, సిద్ధప్ప,ఖలీల్ భాషా, సుధాకర్ బాబు, ఆంజనేయులు శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వైద్యం పట్ల
# ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



ఏజె ఆసుపత్రిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జెనీఫర్

పీలేరు జూన్ 29 ప్రభాతవార్త:

ప్రాథమిక వైద్యం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రముఖ వైద్యులు ఎస్.కె. అలీమ్, డాక్టర్ డి. జెనిఫర్ తెలిపారు. మేము సైతం సమాజం కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఏజె వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, 129 మందికి వైద్యంతో పాటు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ఈ మెడికల్ క్యాంప్ నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించాలన్న ఉద్దేశంతోనే ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే మేము సైతం సమాజం కోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు షేక్ షాహిన్నా మాట్లాడుతూ సమాజ సేవ తమ లక్ష్యమని, ఇలాంటి కార్యక్రమాలు క్రమంగా నిర్వహిస్తూ ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడం తమ బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో మేము సైతం సమాజం కోసం స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బుజ్జు (మోదిన్ బాష), సంయుక్త కార్యదర్శి కలకడ బాబు, ట్రెజరర్ షాజహాన్, కార్యనిర్వాహక కార్యదర్శి రిజ్వాన్, ప్రోగ్రాం ఇన్చార్జ్ ఆదిల్, జిల్లా ఇన్చార్జ్ పటాన్ సయ్యద్, ఆఫీస్ ఇన్చార్జ్ జావిద్, వాలంటరీ ఇన్చార్జ్ సుహెల్, కన్వీనర్ షమా, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కూటమి సుపరిపాలనకు తొలి అడుగు



తంబళ్లపల్లె జూన్ 29 ప్రభాతవార్త :

టిడిపి జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రేపటినుండి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన సుపరిపాలన ఫలాలను ప్రతి గడపకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకొని ప్రజల ఆశీర్వాదాలు అందుకోవాలని తంబళ్లపల్లె టిడిపి ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాదిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇంచార్జ్ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, జిల్లా మంత్రి రాంప్రసాద్ రెడ్డి ల సహకారంతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో సుమారు 300 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన ఈ అభివృద్ధి పనులను నియోజకవర్గంలోని ఆరు మండలాలలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, జనసేన, బిజెపి నాయకులతో ప్రతి కుటుంబాన్ని పరామర్శించి మన ప్రభుత్వం చేసిన సూపర్ సిక్స్, సంక్షేమం అభివృద్ధిని వారికి వివరించాలని గత వైకాపాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని దౌర్జన్యాలు, అరాచకాలు, అక్రమ కేసులు, ప్రజలను భయభ్రాంతులను చేసి ఇసుక, మైనింగ్, మట్టి, లిక్కర్ స్కామ్ తో పాటు నిరుపేదల భూములు కొల్లగొట్టారని తీవ్రంగా విమర్శించి గత ఎమ్మెల్యే చేసిన అరాచకాలను బహిర్గతం చేసి మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో గ్రామాల బాట పట్టి అభివృద్ధితోపాటు గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి అధికారుల సహకారంతో పరిష్కరించాలన్నారు. గత ఎన్నికల్లో వైకాపా అక్రమాలు, దౌర్జన్యాలు, అరాచకాలు, డబ్బు, మద్యం ప్రలోభాలతో స్వల్ప తేడాతో ఓటమి చెందినా నైతిక విజయం మనదేనని ప్రజలు మన పక్షాన ఉన్నారని ప్రభుత్వం మనదేనని ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు కష్టపడాలని ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్తు ఉంటుందని మీకు నేను అండగా ఉంటానని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశించిన 2024 స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా ప్రజలకు సుపరిపాలన అందించడంలో మన వంతు పూర్తి సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ కార్యక్రమాన్ని నెలరోజులపాటు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు.

# అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :

కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం కల్పించాలని రాష్ట్ర మున్సిపల్ వర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటియుసి కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మున్సిపాలిటిలో పనిచేస్తున్న రోజుకూలి కార్మికులకు రావాల్సిన ఆరునెలల వేతనాన్ని వెంటనే చెల్లించి వారికి కూడా ఆప్కాస్‌లో అవకాశం కల్పించి ఈపిఎస్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. మున్సిపల్ స్కూల్‌లో స్వీపర్లుగా పనిచేస్తున్న వారికి వేతనం పెంచాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంకోసం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ వర్కర్స్ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ముభాకర్, కోకన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామచంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్. నరసింహులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, నాయకులు మస్తాన్, చలపతినాయుడు, తిరుమల, దేవా, వాసు, జానకి పాల్గొన్నారు.

# వెంకట మల్లప్ప నాయుడు మృతికి నివాళు



రామాపురం జూన్29, ప్రభాతవార్త

రామాపురం మండలం రాచపల్లె గ్రామం నాయునివారిపల్లె కు చెందిన వైఎస్ఆర్ సిపి నాయకుడు అమృతనాయుడు తండ్రి వెంకట మల్లప్ప నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు.వెంకట మల్లప్ప నాయుడి భౌతిక కాయాన్ని ఆదివారం స్థానిక నాయకులతో కలిసి వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అతని మృతిపట్ల సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ముద్దనూరు, జూన్ 29, ప్రభాతవార్త:

స్థానిక పట్టణంలోని బాలనాగిరెడ్డి వైద్యశాల నందు ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రొద్దుటూరు పట్టణంలోని వీర గాయత్రి హాస్పిటల్, గాయత్రి పర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది గర్భిణీ స్త్రీలకు డాక్టర్ కందుల సుమిత్ర గైనకాలజిస్ట్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి సూచనలు సలహాలు అందించారు. వైద్య శిబిరానికి హాజరైన గర్భిణీ స్త్రీలకు స్కానింగ్, కన్సల్టేషన్, సిమెంట్ అనాలసిస్ వంటి సేవలను ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య జ్యోతి రెడ్డి, మాజీ సర్పంచ్ బాలనాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ బియ్యం పంపిణీ

రామాపురం జూన్ 29 ప్రభాతవార్త



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రేషన్ డీలర్లు ప్రభుత్వ ఆదేశాల మే రకు జూలై నెలకు సంబంధించి నాలుగు రోజులు ముందుగానే వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు బియ్యము సరఫరా చేశారు. ఇంతకు మునుపు ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ సరుకులు సరఫరా చేయాలని ఆదేశాలు ఉన్న ఎండియు వాహనదారులు గ్రామాలలో ఒకచోట వాహనాన్ని నిలబెట్టి అక్కడి నుండే సరఫరా చేసేవారు. దీంతో వృద్ధులు ఆ వీధిలోకి వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే తీవ్ర అవస్థలు పడేవారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నాలుగు రోజులు ముందుగానే తమ ఇంటికి డీలర్లు బియ్యం తెచ్చి ఇస్తుండడంతో వృద్ధులంతా సంతోషపడుతున్నామన్నారు.

# 26వ రోజు కొనసాగిన కార్మికుల సమ్మె

## వాటర్‌ట్యాంకు పైకెక్కి కార్మికులు నిరసనలు




వాటర్‌ట్యాంకు పైకెక్కి నిరసన చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం 26వ రోజు సమ్మెను యదావిధిగా కొనసాగించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని వాటర్‌ట్యాంకు పైకెక్కి కార్మికులు వినూత్న తరహాలో నిరసనలు వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కార్మిక జేఏసి నాయకులు ఎంఎస్.కన్నయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలో, వీధిలైట్లు, తాగునీటి సరఫరాను బంద్ చేసి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటిల్లోనూ శాంతియుత సమ్మె నిరసన చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు అన్యాయం చేస్తున్నదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కూడా రాకుండా అన్యాయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ జేఏసి నాయకులు ఎస్‌కె.రెడ్డప్ప,నాగరాజు, గోపాల్‌క్రిష్ణ, సజాద్‌కుమార్, బాలక్రిష్ణ, కుమార్, మహేష్, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

# అజ్ఞాత వ్యక్తి గ్రామ నాయకునిపై విమర్శలతో కరపత్రం విడుదల

ముద్దనూరు, జూన్ 29, ప్రభాతవార్త:



మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో ఓ గ్రామ నాయకుడిపై విమర్శలు గుప్పిస్తూ అజ్ఞాత వ్యక్తి కరపత్రాలను శనివారం రాత్రి గ్రామంలోని వీధుల్లో వేసినారు, ఆ విషయం ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం రావడంతో గ్రామంలో పోలీస్ సిబ్బందితో సిఐ దస్తగిరి, ఎస్సై మైనుద్దీన్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కరపత్రం విడుదల చేసిన వ్యక్తిపై ప్రత్యేక నిఘా ఉంచి సమాచారం సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కసారిగా గ్రామంలో ఓ గ్రామ నాయకుడిపై విమర్శలు చేస్తూ కరపత్రాలు విడుదల కావడంతో గ్రామ ప్రజలు ఉలిక్కిపడ్డారు.

# డిగ్రీ హానర్స్ సెమిస్టర్ ఫలితాలలో రాణి
# తిరుమల దేవి డిగ్రీ కళాశాల విజయభేరి



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 29 ప్రభాత వార్త :

స్థానిక మైదుకూరు రోడ్డు లోని రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్ విద్యార్థిని విద్యార్థులు యోగి వేమన యూనివర్సిటీ ఏప్రిల్, మే నెలలో నిర్వహించిన రెండు, నాలుగు, ఆరు డిగ్రీ హానర్స్ పరీక్ష ఫలితాలలో చక్కటి ప్రతిభను కనపరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక జీపీఏ పాయింట్స్ సాధించారని కళాశాల కరస్పాండెంట్ తరుణేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మూడో సంవత్సరం బీఎస్సీ బయోటెక్నాలజీ హానర్స్ లో కె ఎస్ రోషన్ 10 /10, వైవి ప్రవంతి 10/10, మూడో సంవత్సరం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్ లో బి సువర్ణ 10/ 10, ఫైజా 10/ 10. మూడో సంవత్సరం బీకాం కంప్యూటర్ అప్లికేషన్ హానర్స్ లో ఏ చంద్రకళ 10/10, రోస్ నా నౌరిన్ 10/10 సాధించారు అలాగే రెండవ సంవత్సరం నాలుగవ సెమిస్టర్ లో బిఎస్సి బయోటెక్నాలజీ హానర్స్ లో ఏ వైష్ణవి 10/10, బి సెరీన మహబూబ్ 9.85 రెండవ సంవత్సరం నాలుగవ సెమిస్టర్ బిఎస్సి కంప్యూటర్ సైన్స్ హానర్స్ లో ఎం వీర భార్గవి 9.45, జి. అశ్విని 9.3 రెండవ సంవత్సరం నాలుగో సెమిస్టర్ బీకాం కంప్యూటర్ అప్లికేషన్ హానర్స్ లో ఎస్ గౌసియా 9.2, బి చౌడేశ్వరి 9.1 మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్ లో ఏ శైలజ 9.25, ఎం హర్షిత 9.42 మొదటి సంవత్సరం సెకండ్ సెమిస్టర్ బయోటెక్ హానర్స్ లో కే లావణ్య 9.25, ఎన్ స్నేహ 9.25 మొదటి సంవత్సరం సెకండ్ బీకాం కంప్యూటర్ అప్లికేషన్ హానర్స్ లో ఏం రాణి 9.42, ఎస్బి రాహిన్ 9.17 జిపిఏ సాధించారు. ఇంతటి మంచి ప్రతిభ కనబరిచిన వీరిని ఆదివారం కరెస్పాండెంట్ ఎల్. తరుణేంద్ర శేఖర్ ప్రిన్సిపల్ టీ చంద్రశేఖర్ రెడ్డి ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వర రెడ్డి అధ్యాపకులు అధ్యాపకేతర బృందం వారిని అభినందించారు.

# శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ర్యాంకులు



రైల్వేకోడూరు రూరల్ జూన్ 29 ప్రభాతవార్త

ఇటీవల యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 2,4 సెమిస్టర్ ఫలితాలలో రైల్వేకోడూరుకు చెందిన శ్రీ సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులైన 4వ బియస్‌సి బాటనీ హానర్స్ నందు ఎస్ సల్మాన్ 9.85,4వ బియస్‌సి హానర్స్ కంప్యూటర్ నందు యన్ రాజేశ్వరి 9.70,4వ బికాం కంప్యూటర్స్ నందు శ్రీ వైష్ణవి 9.50 రెండవ సెమిస్టర్ బీకాం కంప్యూటర్స్ హానర్స్ నందు కే మన్మథ 9.75, ఎస్ ఏ సాజియా, పి జస్వంత్ 9.50, రెండవ సెమిస్టర్ బి యస్ సి కంప్యూటర్స్ హానర్స్ నందు, బి వర్షిణి, కె అక్షయ, యస్ఆయేషా,9.75,2వ సెమిస్టర్ బి యస్ సి బాటనీ హానర్స్ నందు యస్ జాస్మిన్ 9.50 సాధించారని,9.0 జి పి ఎ పైన చక్కటి మార్కులు సాధించి మా కళాశాలకు పేరు ప్రఖ్యాతులు సాధించిన ఆణి ముత్యాలు అని ప్రిన్స్ పాల్ ముత్యాల పెంచలయ్య వారిని అభినందించినట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ పి శ్రీనివాసులు ఎస్ యన్ శ్రీనివాసులు , కంచి రాజు చెంగల్ రాజు, యు అనితా తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జిపిఏ గ్రేడులలో తమ కళాశాల విద్యార్థులు సొంతం చేసుకుంటారని ముత్యాల పెంచలయ్య ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# మొహారం వేడుకలకు అంకురార్పణ

రామసముద్రం జూన్ 29 ప్రభాత వార్త

మండలంలో మొహారం వేడుకలకు అంకురార్పణ జరిగింది. అగ్నిగుండానికి ప్రత్యేక ప్రార్థనలు చేసి గంధం,సాంబ్రాని,పూలు చల్లి గుండాన్ని మూడు సార్లు తవ్వి ప్రారంభించారు. పురాతన కాలం నుండి ప్రతి ఏడాది మండలం లోని తిరుమలరెడ్డిపల్లె దిగువపేట, ఎగువపేట ఆర్.నడింపల్లెలలో మోహారం వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అంకురార్పణ రోజు నుండి ముదునాళ్ళు, ఏడునాళ్ళు, తొమ్మిది నాళ్ళు ఇలా తొమ్మిది రోజుల వరకు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మత సామరస్యంగా, కులమతాలకు అతీతంగా ఈ వేడుకలు నిర్వహిస్తారు. తొమ్మిదవరోజు తిరుమలరెడ్డిపల్లె,ఆర్ నడింపల్లె దిగువపేట, ఎగువపేట నుండి ప్రత్యేక ప్రభలతో కూడిన పీర్లను ఊరేగింపు చేస్తారు. ఈ వేడుకలు చూడడానికి మండలంలోని ప్రజలే కాకుండా ఇతర జిల్లా నుండి కాకుండా కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.



# శ్రీనిధి రుణాలు మహిళలు చెల్లించాలి

నిమ్మనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలంలో శ్రీనిధి రుణాలు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఏబిఎం సంతోష్ హెచ్చరించారు. అగ్రహారం పంచాయితీలో శ్రీనిధి రుణాలు సక్రమంగా చెల్లించకపోవడంతో చింతపర్తివారిపల్లె నల్లొండ చెరువుముందరపల్లెలోని గ్రూపుసభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిసి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నవోదయ విఓ కింద ఉన్న గ్రూపులు దాదాపు రూ.5.60లక్షలు చెల్లించాలన్నారు. గతంలో ఇక్కడ సంఘమిత్రాగా ఉన్న శారద సభ్యులు చెల్లించిన సొమ్మును దుర్వినియోగం చేయడంతో నవోదయ విఓను బ్లాక్‌లిస్టులో పెట్టామన్నారు. ప్రస్తుతం మండలానికి శ్రీనిధి ఉన్నతి నిధులు మంజూరు అయ్యాయని బకాయిలున్న గ్రూపు సభ్యులు సోమవారం లోగా చెల్లించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సాంబశివ, ఏపిఎం మురళి తదితరులు పాల్గొన్నారు.



గ్రూపుసభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

# యువకుడు ఆత్మహత్యాయత్నం

రామసముద్రం జూన్ 29 ప్రభాతవార్త



పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు గజ్జి గాని పల్లి కి చెందిన వినోద్ కుమార్ ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామసముద్రం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఇతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

# వేడుకగా పాలేటి గంగమ్మ జాతర

నిమ్మనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :

మండలంలోని దేవళం కురప్పల్లిలో వెలసిన పాలేటి గంగమ్మ, గంగాపురంలో వెలసిన బోయకొండ గంగమ్మ జాతర శని, ఆదివారాల్లో ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మహిళలు, డీలు, బోణాలు మోసాలు, రాత్రి కోలాటాలు, చెక్కభజనలు ప్రజలను అకట్టుకొన్నాయి. చాందీనిబండ్లు కట్టి ఊరేగింపు చేపట్టి అమ్మవారి మొక్కలు తీర్చుకొన్నారు. అనంతరం ఆదివారం తెల్లవారుజామున జంతుబలి ఇచ్చి పండగ వేడుకగా జరుపుకొన్నారు. గ్రామాల్లో గంగజాతర నిర్వహిస్తుండడంతో బంధువులు, స్నేహితులు రాకపోకలతో గ్రామాల్లో సందడి నెలకొంది.

# అట్టహాసంగా సినీ గేయ పోటీలు.!

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)
అమర గాయకులు ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాంజలి సంస్కృతిక కళా పీఠం ఆధ్వర్యంలో అట్టహాసంగా రాష్ట్రస్థాయి సినీ గేయ పోటీలు ఆదివారం రాజంపేట వైష్ణవి డిగ్రీ కళాశాలలో జరిగాయి. గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, మేమెంటోలు ప్రధానం చేశారు. తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ సినీ గాయకులు, గాన గాంధర్వులు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రమణ్యం 79 వ జయంతి వేడుకలు సందర్భంగా కళాంజలి సాంస్కృతిక కళా పీఠం అధ్యక్షులు కళాంజలి, విజయ కళ్యాణ్ ఆధ్వర్యంలో అట్టహాసంగా రాష్ట్రస్థాయి సాంస్కృతిక, సినీ గేయ పాటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది కాశీ విశ్వనాథ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ సినీ గాయకులు, తన పాటల ద్వారా తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం అన్నారు. ఘంటసాల జ్ఞాపకార్థం రాజంపేటలో కళాంజలి సాంస్కృతిక కళా పీఠం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు చిన్నపిల్లల నుండి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను కనబరిచారన్నారు. నేటి ఆధునిక యుగంలో ఇలాంటి సాంస్కృతిక, సినీ గేయ పోటీలు నిర్వహించడం వల్ల సృజనాత్మక శక్తిని వెలికి తీయవచ్చు అన్నారు. అనంతరం కళాంజలి సాంస్కృతిక కళాపీఠం అధ్యక్షులు కళాంజలి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాజంపేటలో ప్రముఖ సినీ గాయకులైన ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం జ్ఞాపకార్థం పాటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా రాజంపేటలో అత్యంత వైభవంగా సాంస్కృతిక, సినీ గేయ పోటీలను నిర్వహించా మన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే వారి జ్ఞాపకార్థం గాన గాంధర్వుడు అవార్డును, ఎస్పీ బాలసుబ్రమణ్యం స్మారక స్వరార్చన అవార్డులను చెన్నైకి వెళ్లి స్వర్గీయ బాలసుబ్రమణ్యం తనయుడు ఎస్పీ చరణ్, ప్రముఖ గాయకురాలు సుశీల కు అందజేస్తామన్నారు. అనంతరం పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటో లను అందజేశారు. రానున్న రోజుల్లో రాజంపేట పట్టణ కేంద్రంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఘంటసాల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ముందుగా స్వర్గీయ ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటాలకు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ఆకాశవాణి కళాకారుల సంగీత విద్వాంసులు గుణకల సుబ్బరాయుడు, నవోదయ సంగీత స్కూల్ విధ్వంసుడు వెంకటాద్రి, నిర్వాహకులు సత్యవతి దేవి, ఎస్ రాధిక వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గాయనీ, గాయకులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



## చైతన్య సంస్థను సందర్శించిన వెరిటాస్ ఫైనాన్స్‌సంస్థ




విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :
పట్టణంలోని దేవతానగర్ నాలుగువ నెంబర్ రోడ్డులో ఉన్న చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థను వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చెందిన వారు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ జనరల్ సెక్రటరీ కవితారాణి మాట్లాడుతూ ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధులు, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలను వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి తెలియజేశారు. అనంతరం అరు, ఏడ తరగతులకు చెందిన విద్యార్థులకు రూ.14వేల విలువచేసే టెక్స్‌బుక్స్‌తో పాటు ఇంటర్‌మీడియట్ చదువుతున్న ఇద్దరు బాలికలకు రూ.2400లు విలువ చేసే యూనిఫామ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో చైతన్య స్వచ్ఛందన సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆనందం, జనరల్‌సెక్రటరీ కవితారాణి, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

## బాస్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న దృశ్యం

మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :
బాస్ ఆధ్వర్యంలో 20వ ఉచిత గుండెవైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని అమ్మచెరువుమిట్ట మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ పర్యవేక్షణలో నారాయణ హృదయాలయ వైద్యులు ఎస్. కిరణ్‌కుమార్‌తో కలసి ఉచిత గుండెవైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 5309మందికి గుండెపరీక్షలు చేయడం జరిగింది. ఇందులో 591 మందికి గుండె సంబంధిత జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ కాగా వీరిలో 537 మందికి కోలార్‌లోని నారాయణ హార్ట్ సెంటర్‌లో ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్సలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకులు కోనేటి దివాకర్, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాలమోహన్, నీరుగట్టి రమణ, పీర్‌బాషా, బాస్ ప్రతినిధులు గంగాధర్, గంపల రమణ, తలారిక్రిష్ణ, డాక్టర్ గంగాద్రి, అంజనప్ప, మేనేజర్ నరేష్, టెక్నిషియన్లు మనోజ్, దానియా, రెడ్డికుమారి పాల్గొన్నారు.

## హార్సిలీహిల్స్‌పైన అంగుళం స్థలం రాందేవ్‌బాబాకు ఇస్తే పోరాటం తప్పదు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ఈశ్వరయ్య




సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మదనపల్లె, జూన్ 29 ప్రభాతవార్త :
పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం సిపిఐ జిలాన్మల రెండవ మహాసభల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పది వేల కోట్ల రుపాయలు నిధులు కేటాయించాలని, జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల తెగిపోయిన నీటి ప్రాజెక్టును పూర్తి చేయాలని, కడప నుంచి రాయచోటి మదనపల్లె మీదుగా బెంగుళూరుకు రైల్వేలైన్ నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలిపారు. చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్ పనులు పూర్తి చేసి, మెడికల్ కళాశాలను ప్రభుత్వమే కొనసాగించాలన్నారు. ఇలాంటి అభివృద్ధి అంశాలను పక్కన పెట్టి ముఖ్యమంత్రి రామ్‌దేవ్ బాబాకు హార్సిలీహిల్స్‌ని అప్పగించి అంతర్జాతీయ యోగా కేంద్రం అభివృద్ధి చేస్తామని,యోగాతో ప్రజలు ఆరోగ్యం బాగుపడుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. యోగా పేరుతో పేదల ఊటిగా ఉన్న హార్సిలీహిల్స్‌ని అప్పగిస్తే సహించేది లేదన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రోడ్డుపైన పోస్తుంటే రామ్‌దేవ్ బాబా కోసం మిని ఎయిర్‌పోర్టు కడుతామని చెప్పడం సిగ్గుచేటుగా ఉందన్నారు. రామ్‌దేవ్‌బాబాకు హార్సిలీహిల్స్ అప్పగిస్తామంటే జిల్లా ప్రజానీకాన్ని సమీకరించుకొని పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిసాహెబ్, జీవి.శివకుమార్, పిఎల్.నరసింహులు, మహేష్, క్రిష్ణప్ప, మనోహర్‌రెడ్డి, సాంబశివ, శివ, శీనూ, సుమిత్రమ్మ, మురళి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడుకి అభినందనల వెల్లువ



పీలేరు జూన్ 29 ప్రభాతవార్త:
టిడిపి పీలేరు మండల పార్టీ అధ్యక్షుడిగా రెండవసారి పునర్ నియామకమైన వారణాసి శ్రీకాంత్‌రెడ్డికి పార్టీ అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పీలేరు పట్టణానికి చెందిన పాత బస్టాండ్ క్లస్టర్ ఇంచార్జ్ ఇస్మాయిల్ నేతృత్వంలో శ్రీకాంత్ రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ టిడిపి కార్యకర్తల పార్టీ అని కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తుందని అన్నారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో తమకు రెండవసారి మండల పార్టీ అధ్యక్షుడిగా పదవి వచ్చిందని, అందుకు సహకరించిన పీలేరు మండల నాయకులు కార్యకర్తలకు శ్రీకాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రెండవసారి పదవి వరించడం తమ బాధ్యతలు మరింత పెరిగిందని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మోదిన్ భాష, నౌలాక్, షమ, ఇంతియాజ్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## వైవియు డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో ఎస్వీడిసి విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు అర్బన్, జులై 29 ప్రభాతవార్త :
స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు 7 మంది 10 కి 10 జీపిఏతో సత్తా చాటారని కళాశాల కరస్పాండెంట్ హరి నారాయణ తెలిపారు. 4వ సెమిస్టర్ ఫలితాలలో 10 జిపిఏ కు గానూ బిఎస్సీ జువాలజీ గ్రూప్ లో తేజస్విని, మాధవి లక్ష్మీ లాలస, మంజులత 10, తస్లీమ్, చందన 9.7, బిఎస్సీ బయోటెక్నాలజీ లో జ్ఞానశ్రీ 10, తన్మయ 9.7, శ్రావణి, ఫర్హా 9.55, బిసిఏలో హర్షిత 9.65, ఆయేషా 9.25, యాస్మిన్, ప్రవల్లిక 9.20, బిఎస్సీ కంప్యూటర్ సైన్స్ లో లక్ష్మీప్రసన్న 9.65, శ్రీ ప్రియ 9.15, బికాం కంప్యూటర్స్ విభాగంలో హసీనా 9.30, హసీనా, పరిమళ 9.10, 2వ సెమిస్టర్ ఫలితాలలో 10 జీపిఏకు గానూ బిఎస్సీ జూవాలజీలో సబీనా, ముష్కాన్ 10, సహనా, గౌసియా, సుప్రియ 9.75, బిఎస్సీ బయోటెక్నాలజీ లో బ్లెసీనా 9.56, బిఎస్సీ కంప్యూటర్ సైన్స్ లో దీవెన, నాగ రచన 8.92, బిసిఏ విభాగంలో నాగశ్వేత 8.92, గంగా హరిత 8.75, బిబిఏ గ్రూప్ లో లక్ష్మీ ప్రవల్లిక 9.33, బికాం కంప్యూటర్స్ విభాగంలో హారిక 9.08, సాయి వైష్ణవీ 8.83 జీపిఏ సాధించారని వివరించారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో కరస్పాండెంట్ తో పాటు డైరెక్టర్ పృధ్వి నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శారదా భవానీ, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రామమోహన్, అధ్యాపకులు గౌరీ శంకర్, మోనయ్య, అజ్రా, గంగా భవానీ అభినందించారు.




## అంబేడ్కర్ గురుకులాన్ని తరలించాలని చూస్తే ఉద్యమం తప్పదు

బ్రహ్మంగారిమఠం జూన్ 29 ప్రభాతవార్త :
బ్రహ్మంగారిమఠం మండలంలో తోట్లపల్లి మహా గురుకులం లో ఉన్న పాటుగా ఓపెన్ చేసి తరగతులు నిర్వహించాలని పక్కనే ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలను విలీనం చేయాలని చూస్తే సహించమని పార్టీ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బ్రహ్మంగారిమఠం లోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను సిపిఎం మండల కార్యదర్శి సునీల్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి పెద్దల్లపల్లి ప్రభాకర్ ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ1974లో ఏర్పాటైన అంబేద్కర్ గురుకుల పాఠశాల ఎన్నో ఏళ్లుగా సమాజంలో విద్యార్థులను ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్లడానికి ఎంతో మందికి జీవిత పాఠాలు నేర్పిన అంబేద్కర్ గురుకులాన్ని తరలించాలని చూస్తే పోరాటం చేస్తామని నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ గురుకులాన్ని తరలించాలని ముందు విద్యార్థుల తల్లిదండ్రులకు ఏమైనా సమాచారం ఇచ్చారా అని వారు ప్రశ్నించారు. తోట్లపల్లి మహా గురుకులం 900 మంది సంఖ్య ఉండాల్సిన మహా గురుకులంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుండి విద్యార్థులను తీసుకొచ్చి విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలని ఉన్నఫలంగా స్కూలు మొదలు పెట్టాలనే ఉద్దేశంతో బ్రహ్మంగారిమఠంలోని ఏళ్ల తరబడి విద్యార్థులను ఉన్నత స్థాయికి అందించిన అంబేద్కర్ గురుకులన్నీ విద్యార్థులు తక్కువ ఉన్నారని, సౌకర్యాలు లేవని, పాఠశాల మరమ్మతుల సాకుతో ఇక్కడ నుండి పాఠశాలను మహా గురుకులంలో విలీనం చేయాలనుకోవడం పనికిమాలిన చర్యగా భావిస్తున్నాం. అవసరమైతే రాబోయే విద్యాసంవత్సరం లో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలే తప్ప ఎంతో మంది విద్యార్థులకు జీవిత పాఠాలు నేర్పిన అంబేద్కర్ గురుకులాన్ని విలీనం చేయాలని చూస్తే ఉద్యమం తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శిలు సోమిరెడ్డిపల్లి నారాయణ, చేజర్ల రవి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఓబన్న విద్యార్థి ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



## సారా రహిత గ్రామాలకు సహకరించండి

మదనపల్లెక్రైమ్, జూన్ 29 ప్రభాతవార్త.
సారా రహిత గ్రామాలకు సహకరించాలని మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె మండలంలో ఉన్న కొండమీద చెరువుతాండ, తుమ్మల తాండ, దాదినాయుని తండా, చెంబకూరులోని దళితవాడల్లో నాటు సారా తయారీ, అమ్మడం నిషేధం పై సదస్సులు నిర్వహించామన్నారు. ఈ నాలుగు గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించామన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల ఆదేశాలతో చైతన్య కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. గ్రామస్థులందరూ కలిసి సారా రహిత గ్రామాలను తీర్చి దిద్దడానికి నవోదయం 2.0లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. నవోదయం 2.వీ కార్యక్రమంలో భాగంగా అవేర్నెస్ కాంపెయిన్‌ల ద్వారా గ్రామస్తులకు నాటు సారా వలన కలిగే కష్ట నష్టాలను వివరంగా తెలియజేయటం, గ్రామాలలో విస్తృతంగా దాడులు జరపడం, పాత ముద్దాయిలను మరియు అనుమానితులను సంబంధిత మండల తహసీల్దార్ వారి వద్ద బైండ్ ఓవర్ చేయించడం వంటి కార్యక్రమాల ద్వారా సారా ను అరికట్టడం జరిగింది. మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయ సహాయంతో పూర్తిగా నాటుసారా లేకుండా చేయడమైందాన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు సంబందించిన సంబంధిత గ్రామ కమిటీ సభ్యులైన ఎక్సైజ్ శాఖ అధికారులు, ఎస్ ఐ లు, రెవిన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు అందరు కలిసి ప్రజల సమక్షంలో నాలుగు గ్రామాలను సారరహిత గ్రామాలుగా ప్రకటించడమైం దన్నారు. సారా అమ్మకాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 14405కు సమాచారం ఇవాలన్నారు.

## దప్పేపల్లె పర్యటించిన శ్రీకాంత్ రెడ్డి



లక్కిరెడ్డిపల్లె; జూన్ 29 ప్రభాతవార్త
దప్పేపల్లి డి.రామాపురం గొల్లపల్లెలో ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, నాయకులతో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా ప్రజలు, రైతులు శ్రీకాంత్ రెడ్డి ని కలిసారు. అదును పోతున్నా ,వర్షాలు కురవలేదంటూ రైతులు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో రైతు భరోసా పెట్టుబడి నిధులు అందక, రైతులము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పాల రేట్లు లీటరుకు రూ 10 తగ్గిందని, ఏ ప్రభుత్వ పథకమూ అందకపోవడం వల్ల చేతి ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుచున్నామంటూ శ్రీకాంత్ రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.జగన్ హయాంలో ఏటా తమకు రైతు భరోసా ద్వారా డబ్బులు అందేవని, పంటలు నష్టపోతే ఇన్ పుట్ సబ్సిడీ,పంటల బీమా అందేదని, పంటల బీమా కు జగన్ ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేదని, ఇప్పుడు తమ నుంచే ప్రీమియాన్ని కట్టించుకుంటున్నారంటూ రైతులు శ్రీకాంత్‌రెడ్డికి వివరించారు.

వైయస్సార్సీపి నాయకులను పరామర్శించిన శ్రీకాంత్ రెడ్డి

దప్పేపల్లి గ్రామం డి రామపురం గొల్లపల్లి కి చెందిన వైఎస్ఆర్సీపి నాయకులు బాలే కదిరప్ప అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో గడికోట శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన బాలే ఓబులేసును కూడా ఆయన పరామర్శించారు. అలాగే కోనంపేట గ్రామం కొండావాం ఢ్లపల్లెకి చెందిన వైఎస్ఆర్సీపి నాయకులు కొండా బలరామిరెడ్డి, లెక్చరర్ కొండా నాగముణి రెడ్డి మాతృ మూర్తిని శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ కొండా ప్రసాద్ రెడ్డి, సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, వైయస్సార్ సిపి నాయకులు సిద్ధారెడ్డి, రమేష్, ధర్మారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పెద్ద ఓబులేసు, చిన్న ఓబులేసు, ముమ్మన్న బోయిన ఓబులేసు, బాలే ఓబులేసు, చాన్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహంపై చెప్పుల దండ వేయడం దారుణం

మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచ నాగమల్లేశ్వరి



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 29 ప్రభాతవార్త:
అంబేద్కర్ అంటే ఎస్సీ ఎస్టీలకు మాత్రమే కాదు అన్ని కులాలకు న్యాయం చేసిన మహోన్నతుడని, రాజ్యాంగాన్ని రచించిన వ్యక్తి మీద చెప్పులు దండలు వేయడం, విగ్రహాలను పగలగొట్టడం దారుణమని, అధికార మదంతో చేస్తున్న ఈ సంఘటనలను మాల మహానాడు ఖండిస్తోందని మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచ నాగమల్లేశ్వరి అన్నారు. ఆదివారం హైదరాబాద్ కు వెళ్తూ మార్గమధ్యంలో జిల్లా అధ్యక్షుడు జేష్టది భాస్కర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ అంబేద్కర్ని కించపరిచిన వాళ్ళు ఒళ్ళు దగ్గర పెట్టుకొని నడుచుకోవాలని హెచ్చరిస్తూ అంబేద్కర్ ఆశాభావంతో ఆయన సిద్ధాంతాలతో మేము ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా యూత్ లీడర్ పందిటి రాజేష్,జిల్లా కార్యదర్శి సునీల్,ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు పవన్, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు స్వరూప్, వీర కిరణ్ కుమార్, కళ్యాణ్ బాబు, హ్యూమన్ రైట్స్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ముత్యాల ప్రసాద్ రావు, హ్యూమన్ రైట్స్ వెంకటన్న పలువులు దళిత నాయకులు పాల్గొన్నారు.

## ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిఎస్టి అవగాహన సదస్సు




కడప జూన్ 29 ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర జనరల్ బాడీ మీటింగ్, జీఎస్టీ అవగాహన సదస్సు ఆదివారం గుంటూరు నగరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రజల సమస్యలే పరమావిధిగా భావించి, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని, ప్రజలకు ఏదైనా సమస్యలు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు ఎంపీలు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొని వచ్చి వాటిని పరిష్కరించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి మూల కారణం జిఎస్టి నే అని, జిఎస్టి ద్వారా ప్రతినెల ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని. జిఎస్టి ప్రాక్టీషనర్స్ అటు ప్రభుత్వానికి ఇటు వ్యాపారస్తులకు మధ్య వారదులుగా ఉంటూ ఎనలేని సేవలు చేస్తున్నారని, వారి సేవలు ప్రశంసనీయమని తెలిపారు. తెనాలి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో టాక్స్ ప్రాక్టీషనర్స్ చేస్తున్న సేవలు అభినందనీయమని, వ్యాపారస్తుల టాక్స్ కు సంబంధించిన సమస్యలను తమ భుజ స్కందాలపై వేసుకొని ఎల్లప్పుడు కూడా ప్రభుత్వానికి సహకారం అందిస్తున్నారని, జీఎస్టీ లో ఎలాంటి సమస్యలు ఉన్న వాటిని తమ దృష్టికి తీసుకుని వచ్చినట్లయితే, జిఎస్టి కౌన్సిల్ దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత అసోసియేషన్ గౌరవ సలహాదారులు పఠాన్. షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ గతంలో జిఎస్టి లో వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ కూడా ఆర్థిక మంత్రి మరియు జిఎస్టి కౌన్సిల్‌కు తీసుకెళ్లి 90 శాతం సమస్యలను పరిష్కరించానని, ప్రస్తుతం కూడా ఎప్పటికప్పుడు సమస్యలు జిఎస్టి కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తున్నానని మరియు వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రస్తుత అధ్యక్షులు డి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీటీపీసీఏ సభ్యుల యొక్క మేలే తమ శ్రేయస్సు అని, ప్రతి సభ్యుడు కూడా తన ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటూ, జిఎస్టి రిటర్న్ ఫైల్ చేయడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## భక్తిశ్రద్ధలతో వారాహి అమ్మవారి శ్రీమంతం



ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పీలేరు జూన్ 29 ప్రభాతవార్త :
వారాహి అమ్మవారి గుప్త నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా పీలేరు బ్రాహ్మణ వీధిలోని శివాలయ ప్రధాన అర్చకులు విరూపాక్షం కుమారస్వామి ఇంటిలో ఆదివారం అమ్మవారి శ్రీమంతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీమంతం సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని వివిధ సుగంధ పుష్పాలు సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అలంకరించి వివిధ రకాల పిండి వంటలను అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీమంతం కార్యక్రమం సందర్భంగా అమ్మవారికి ముత్తయిదువుల ప్రార్థన ప్రత్యేకంగా నిర్వహించారు.

## ప్రత్యేక పూజలు అందుకున్న నాగర్పమ్మ తల్లి

సుండుపల్లె, జూన్ 29, ప్రభాతవార్త :
మహిమగల తల్లి అడిగిన వెంటనే భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం శ్రీ నాగారపమ్మ తల్లి పిల్లలు లేని ఆడవాళ్లకు బిడ్డలను ప్రసాదించే శక్తిగల మహిమగల అమ్మగా పేరుంది.దశాబ్దాల కాలంనాటి చరిత్ర కలిగిన శ్రీ నాగారపమ్మ తల్లి చరిత్ర చూస్తే మండల పరిధిలోని పెదినేని కాలువ పంచాయతీ బండకాడ ఈడిగ పల్లె గ్రామంలో బాహుదా నది పరీవాహ ప్రాంత సమీపంలో వెలసిన



శ్రీ నాగారపమ్మ తల్లి మహిమలు చుట్టుపక్కల జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తూ ఉంటారు. ఈ మహిమగల తల్లి భక్తుల పాలిట కొంగు బంగారమై పూజలందుకుంటుంది . ఆదివారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పుట్టను పూజించారు. మొక్కులు ఉన్న భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలను సమర్పించుకున్నారు.

# పాతికేళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





కడప జూన్ 29 ప్రభాతవార్త:
వీరబల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999, 2000 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉదయం అట్టహాసంగా జరిగింది. ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్నవారు అందరూ హాజరయ్యారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. పూర్వ విద్యార్థులు తమకు విద్యను బోధించిన నాటి ఉపాధ్యాయులు రామకృష్ణమూర్తి, మడితాటి నరసింహారెడ్డి, శ్రీనివాసులు, శోభన్ బాబు మల్లేశం, హరినాథలను దుశ్యాలవులతోనూ పూలమాలలతోనూ జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు, పాఠశాల పూర్వ విద్యార్థి ఎన్ గిరిబాబు, మస్తాన్ లు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులు కలుసుకొని తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సన్మానించడంతోపాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం 10,000 రూపాయలను పాఠశాల ఉపాధ్యాయులు రామ్మోహన్ కు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి మరింత సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు నాటి రోజులను గుర్తుకు చేసుకొని ఓల్డ్ ఇస్ గోల్డ్ అనే మాట మరోసారి నిరూపితమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.